# జిజ్ఞాస

పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ గారి సన్నిధి లభించటము పూర్వజన్మ సుకృతం, వారి సాన్నిధ్యం లభించటము సాధనకు మెట్టు, వారితో భాషించటము సంస్కారాల మార్పుకు పునాది. వివిధ సందర్భాలలో భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆచార్య శ్రీ భరద్వాజ గారు అందించిన అమృత గుళికలు ఏప్రిల్ 12వ తేది మాస్టారి గారి అరాధనోత్సవము సందర్భముగా మీకందిస్తున్నాము.

**– సంపాదకుడు**

**ప్రశ్న : మన ఖర్మ ఎలా ఉంటే అలా జరిగితీరుతుందికదా?**

**జవాబు :** ఔను, నిజమే.

**ప్రశ్న : అలాంటప్పుడు సద్గురువుతో పనేముంది?**

**జవాబు :** సద్గురువు విషయంలో సాధారణమైన సూత్రాలు పొసగవు. ఒక భక్తుడు సద్గురుని కృపకు పాత్రుడయ్యాడంటే అతనిని సద్గురువు ఎలా నడిపిస్తాడనేది చాలా చిత్రంగా ఉంటుంది. అ భక్తునికి సంబంధించిన భవిష్యత్తును గూర్చిన ఫిల్మ్ అంతా సద్గురుని పరమవుతుంది. కావాలంటే అ ఫిల్ములో అవసరమైన భాగాలు కాల్చేసేదానికి గాని, ఆ ఫిల్ములోని బొమ్మలు మార్చి వేరేవి వ్రాసేందుకుగాని,



లేక అ ఫిల్ములోని కొన్నిభాగాలు ప్రస్తుత జీవితంలో అనుభవానికి రాకుండా మరొక జన్మకు మార్చేందుకుగానీ, లేక అదే జీవితంలో ఆ వ్యక్తి ఆధ్యాత్మికంగా బాగా ఎదిగి ఆ అనుభవాలకు చలించకుండా ఓర్పుతో అనుభవించే మరొక భవిష్యత్ కాలానికి మార్చడానికిగానీ ఆయనకు అధికారముంటుంది. కనుక సద్గురు కృప పొందినవారికి సద్గురువు చేయలేనిదంటూ ఏమీలేదు. ఆ భక్తుని ఆధ్యాత్మిక పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సద్గురువు ఏమైనా చేయగలరు. ఒక్కొక్కప్పుడు ఆభక్తుని ప్రారబ్ధాన్ని స్వప్నాలలో అనుభవింపజేయడం, జాగ్రత్తులో దాని బాధ లేకుండా చేయడం కూడా మనం చూస్తాము. బాబా చరిత్రలో రక్తం కక్కుకునే క్షయ వ్యాధిగ్రస్తుని చెడ్డ కర్మలను "స్వప్నంలో టీచర్ కొడుతుంటే అరచేతులనుండి రక్తం కారుతూ అతడు తీవ్రంగా ఏడుస్తాడు. మరొకరోజు ఎవరో రోడ్డు రోలరును అతని గుండెలమీద నడుపుతున్నారు. అతడు భయంకరంగా ఏడుస్తుఉన్నాడు. తర్వాత స్వప్నం అంతరించింది". అ భక్తునికి ఆరోగ్యం చేకూరింది. కనుక మన ఆధ్యాత్మిక, లౌకిక అభివృద్ధి దృష్ట్యా సద్గురుని పాత్ర గణనీయంగా ఉంటుంది. ఐతే సద్గురుని కృప పొందడంలోనే భక్తుని సామర్థ్యమంతా ఇమిడి ఉంటుంది.

**ప్రశ్న : సత్సంగం ఎందుకు చేయాలి? మహనీయుల చరిత్రలు చదవడమెందుకు?**

**జవాబు :** సత్సంగం చేసినందున చదివేవారికి తమలోని లోపాల ప్రసక్తి వచ్చినప్పుడు హృదయంలో కలుక్కుమనిపిస్తుంది. కొంతమంది తీవ్ర పరితాపానికి గురియై ఈ జన్మలోనే ఆయా లోపాలు తన ప్రవర్తన నుండి నిర్మూలించుకుంటారు. ఒకవేళ అలా నిర్మూలించుకోలేకుంటే హృదయాలలో కలుక్కుమనే బాధ భావాలుగా ఈ జన్మకు సంస్కారంగా నిలచిపోయి వచ్చేజన్మకు సంక్రమిస్తుంది. సత్సంగం నిర్వహించినవారు అలాంటి దుర్గుణ రాహిత్యానికి కలుక్కుమనే పునాదిరాయి వేశారన్నమాట. అది మహాగొప్ప పుణ్యకార్యము. భూమిలో రెండు గూటాలు నాటబడి ఉన్నాయి. ఒక గూటాన్ని నిత్యం కొంతసేపు కదిలించి వదిలేస్తున్నాము. మరి యొకదాన్ని అలా కదిలించమనుకోండి. కొంతకాలానికి ఈ కదిలించే గూటం సులభంగా పీకేసేందు వీలౌతుంది. కదిలించనిది ఒకేరోజు పీకాలంటే ఊడిరాదు. అలాగే మనలోని దుర్గుణాలు కూడ, కనుక నిత్యం సత్సంగం చేయడం ఎంతైన అవసరము.

**ప్రశ్న : సాయి చరిత్ర ఎందుకు మరలా మరలా చదవాలి?**

**జవాబు :** ఈ విశాల విశ్వమంతా సాయి రూపంగా చూచేందుకు నేర్చుకునేందుకు, తాను ఆధ్యాత్మికంగా ముందుకుపోయేందుకు ఏజగత్తైతే అడ్డమవుతుందో – సాయి చరిత్ర హృదయ గతమైన వారికి ఆజగత్తే ఆధ్యాత్మికంగా ముందుకు పోయేందుకు ఉపకరిస్తుంది. పేను, నల్లిని చంపేందుకు వెనుకాడుతాము, కాని మన విరోధిని పరోక్షంగా విమర్శించకుండా ఉండలేము. అలా విమర్శించడం తప్పని గుర్తించి అ చెడ్డసంస్కారము నుండి బయటపడందే సాయి మనకు ఎన్నిచేసినా ప్రయోజనం లేదు. సాయినాధుని దగ్గర భిక్షమెత్తే స్థితినుండి బయటపడలేము. తాళాల గుత్తి తీసుకోలేము. సర్వం ఋణానుబంధానుసారమే జరుగుతుందని విశ్వసించి నడుచుకోవాలి. లేకుంటే మనది మిథ్యాసాధనవుతుంది. చెన్నబసప్ప, వీరభద్రప్పలవలె తయారవుతున్నామన్నమాట. కనుక చరిత్ర పఠనము, శ్రవణంతోటి హృదయ పరిశీలన ఎంత ముఖ్యమో ఆలోచించాలి.